క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన టీటీడీ బోర్డు సభ్యుడు



టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమ బాబును సత్కరిస్తున్న కలెక్టర్ విజయ రామరాజు

కడప కార్పొరేషన్ : తిరుమల, తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు ఆర్. వెంకట సుబ్బారెడ్డి (మాసీమ బాబు) కలెక్టర్ విజయరామరాజును కలిశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి తిరుపతి లడ్డులు అందించారు. ఈ సందర్భంగా మా సీమ బాబును కలెక్టర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, రాజా పాల్గొన్నారు.

ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు చర్యలు



పార్కు ముందు ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగర ప్రజల కోసం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న భగత్ సింగ్ పార్కు ముందు ఉన్న ప్రదేశంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈట్ స్ట్రీట్ ప్రణాళికలు, డిజైన్లు పరిశీలించి దాని ప్రకారం మార్కింగ్ ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు చేయడానికి అవసర మైన సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి, డీఈ అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఘన సన్మానం



శచీదేవిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో పనిచేస్తున్న జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ పి. శచీదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ , అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాష మాట్లాడుతూ శచీదేవి విద్యాబోధన, సేవలను కొనియాడారు. అవార్డు గ్రహీత శచీదేవి మాట్లాడుతూ ఈ అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా..

ముగిసిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

కడప కల్చరల్ : శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా స్థానిక ద్వారకా నగర్ కాలనీలోని శ్రీ మురళీకృష్ణ ఆలయంలో ఉదయం నుంచి మూలమూర్తికి సుప్రభాత సేవ తిరుమంజన సేవ నిర్వహించి పూలతో విశేష అలంకారం చేశారు . తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనం కోసం బారులు తీరారు . ఆలయంలోని ధ్యాన మందిరంలో భక్తులు సామూహికంగా గీతా పారాయణం చేశారు. నగరవాసులైన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నగరంలోని శ్రీ కృష్ణ ఆలయం ఇదొక్కటే కావడంతో సమీప గ్రామాలకు చెందిన భక్తులు కూడా ఉదయం సాయంత్రం స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో స్వామికి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలలు, యువకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉత్సాహభరితంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ కొద్దిసేపు ఆ ప్రాంతం ఉల్లాస భరితంగా మారింది. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కొలువు తీర్చి స్థానిక వీధుల్లో వైభవంగా ఊరేగించారు. వీధుల్లోని భక్తులు స్వామిని దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇల్లంతా నల్లనయ్యే... మనసంతా కన్నయ్యే..

ఆ ఇల్లంతా నల్లనయ్యే. ఆ ఇంటి వారితో పాటు వేడుక చూడడానికి వచ్చిన వారి మనసంతా కన్నయ్యే. కడప నగరం ఎన్జీవో కాలనీలోని ఓ ఇంట్లో గురువారం శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. వీధి బయటనుంచి ఇంట్లోకి నల్లనయ్య నడిచి వచ్చినట్టుగా చిన్నారి పాదాల ముద్రలను చిత్రించారు. ఇల్లంతా పూలతో నింపి దాదాపు 50 రకాల భంగిమలు దృశ్యాలు గల శ్రీకృష్ణుడు, యశోద, నందుడు, గోపికల మట్టి బొమ్మలను ఆకర్షణీయంగా అమర్చారు. ముత్యాల హారాలు, రంగు రంగుల విద్యుత్ దీపాలు అలంకరించారు. ఇల్లంతా కన్నయ్య బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. ఆ దృశ్యాలను చూసేందుకు స్థానికులు, బంధుమిత్రులు తరలివచ్చారు. నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలను కన్నయ్య చిత్రంతో కూడిన జ్ఞాపికలను అందజేశారు. కొందరు మహిళలు భక్తి గీతాలను ఆలపించారు.



ద్వారకానగర్‌లో దర్శనమిస్తున్న శ్రీకృష్ణుడు



తమలపాకులతో అలంకరించిన చిన్ని కృష్ణుని పాదాలు

కడప రూరల్ : రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణుడి చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ కృష్ణుడి జన్మవృత్తాంతం, ధర్మ రక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ యాదవ్, నాయకులు శివశేఖర్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రత్యేక పూజలందుకున్న శ్రీ వేణుగోపాల స్వామి



కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ /చింతకొమ్మదిన్నె : నగర శివార్లలోని 45వ డివిజన్ పరిధిలో గల ఊటుకూరు గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం సర్వ దర్శనానికి భక్తులను అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బనరసయ్య శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సికెదిన్నె మండలంలోని అప్పరాజుపల్లెలో వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ అమర్‌నాథ్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



కడప రాయునికి మంగళ హారతి ఇస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో అభిషేకాలు నిర్వహించి కనుల పండువగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామిని పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు తివిక్రమ్ మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు చేపట్టారు. తమ ఇళ్ల వద్దకే తరలివచ్చిన దేవతామూర్తులను మనసారా దర్శించుకున్న స్థానిక భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దేవుని కడప వీధిలో స్థానికులు ఉత్సాహ భరితంగా ఉట్టి కొట్టి ఆనందించారు.

ప్రజల హృదయాల్లో ఎల్‌ఐసీ స్థానం పదిలం



మాట్లాడుతున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్

కడప కల్చరల్ : ఎల్‌ఐసీ సంస్థ నమ్మకానికి మారు పేరుగా ప్రజ హృదయాల్లో తన స్థానాన్ని మరింత పదిల పరుచుకుందని యోగివేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చింతా సుధాకర్ అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయ సభాభవనంలో ఎస్‌డీఎం కె.గిరిధర్ అధ్యక్షతన గురువారం జరిగిన బీమా వారోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఒక కార్పొరేట్ సంస్థగా అందించిన సామాజిక సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు పొందిందని అన్నారు. జనం గుండెల్లో స్థిరంగా నిలిచిన, ఎల్ఐసి బీమా రంగంలో మార్కెట్ లీడర్ గా కొనసాగడంలో ఆశ్చర్యం ఏమీ లేదని అన్నారు. వ్యాపార కార్యకలాపాలు, క్లెయిముల చెల్లింపు, సామూహిక బీమా పథకాల నిర్వహణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. 67వ బీమా వారోత్సవాల సందర్భంగా ఆయన ఎల్ఐసి పాలసీదారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్‌డీఎం కె.గిరిధర్ మాట్లాడుతూ ఎల్‌ఐసీ భారతదేశంతో పాటు 14 విదేశాల్లో కూడా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందరావు బీమా వారోత్సవాలపై సమీక్ష చేశారు. ఉద్యోగులకు, మహిళలకు, విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన సిబ్బందికి, గాంధీనగర్ హై స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి కార్యక్రమాలను పర్య వేక్షించారు.

ఈ కార్యక్రమంలో మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్య ప్రసాద్, ఆనందరావు, రాము నాయక్, ఎల్లారెడ్డి, స్వరూప పాల్, గురు రాజ్, పీఆర్సీ కుమార్, అధికారులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల మధ్య శ్మశాన వాటిక వద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని 15వ డివిజన్ హెలెన్ కెల్లర్ బధిరుల పాఠశాల సమీపంలోని ఇండ్ల మధ్య శ్మశాన వాటిక నిర్మించరాదని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక హెలెన్ కెల్లర్ పాఠశాల సమీపంలో శ్మశాన వాటిక ఏర్పాటు పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుల అభిప్రాయాలను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దిలేటి, ఓబయ్య, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రైల్వే గూడ్స్ హమాలీల సమస్యలను పరిష్కరించాలి



డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌కు వినతిపత్రం ఇస్తున్న రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వే స్టేషన్ గూడ్స్‌లో హమాలీల సమస్యలను పరిష్కరించాలని రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు కేసీ.బాదుల్లా, ఎస్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. గురువారం కడప రైల్వే స్టేషన్ పరిశీలనకు వచ్చిన డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు అసౌకర్యంగా ఉన్న ప్లాట్ ఫామ్ సరిచేయాలని, మౌలిక వసతులైన తాగునీరు ఉపయోగించే ఫ్రిడ్జ్ చెడిపోవడం మూలంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూనియన్ కార్యాలయం పైన నీటి ట్యాంకు ప్యూరిఫైడ్ ఫిల్టర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. మరుగుదొడ్లు కూడా కార్యాలయం ఆవరణలో కాకుండా బయట తగినన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలి యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, గంగయ్య, సుబ్బరామ్, సూరి పాల్గొన్నారు.

ఆదాబే మస్జిద్ కరపత్రాలు ఆవిష్కరణ

కడప కల్చరల్ : స్థానిక మురాదియ నగర్ లోని ఆస్థాన ఏ మురాదియ దర్గాలో గురువారం ఆ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లా బాష సాహెబ్ ఆధ్వర్యంలో 'ఆదాబే మస్జిద్' కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఆదాబే మస్జిద్ కరపత్రాలను ముస్లింల కోసం ప్రత్యేకంగా తయారు చేయించామన్నారు. ప్రధానంగా మస్జిద్ లోకి వెళ్లేటప్పుడు, బయటకి వచ్చేటప్పుడు చేసే (దువాలను) ప్రార్థనల గురించి ప్రతి ముస్లింలు తెలుసుకోవాల్సి ఉందన్నారు. అందుకోసం క్లుప్తంగా ఈ కరపత్రాలలో మస్జిద్ నియమ నిబంధనల గురించి పలు సూచనలు, అవగాహన కరపత్రాలను ముద్రించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ లక్ష్మీనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు.

సంఘీభావ ర్యాలీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్ర సంవత్సరం అయిన సందర్భంగా నగరంలో కాంగ్రెస్ నాయకులు సంఘీభావ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, సత్తార్, గుండ్లకుంట శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.





సమస్యల పరిష్కారంతో ఆనందంలో ప్రజలు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



హాజరైన ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది

పెండ్లిమర్రి : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారికి అక్కడే ప్రజల సమస్యలు పరిష్కరిస్తే ప్రజల కళ్లల్లో కలిగే ఆనందం అంతా ఇంతా కాదని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని మహలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం పెండ్లిమర్రి మండల వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్ల, సచివాలయ సిబ్బందికి ఆత్మీయ కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నా పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాయా లేదా తెలుసుకోవడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ దూర దృష్టిగల నాయకుడు కాబట్టే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు.

అనంతరం సీకే దిన్నె జెడ్పీటీసీ సభ్యుడు పి.నరేష్ రామాంజులరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, ఏపీ పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ పాక సురేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రామమోహన్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, మండల బూత్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యాక్షుడు నాగ మల్లారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గొయ్యి... ప్రమాదమోయి

కడప కార్పొరేషన్: కడప నగరంలో మండీ బజార్ వీధిలో ఇరవై రోజుల క్రితం పైపులైన్ కోసం ఈ గొయ్యి తీసి ఇలా వదిలేశారు. రద్దీగా ఉండే ఈ వీధిలో బాలాజీ టెంపుల్ కూడా ఉంది. నిత్యం భక్తులు సంచరిస్తూ ఉంటారు. మండీ బజార్‌కు నిత్యం పెద్ద పెద్ద లారీలు లోడ్‌తో వస్తుంటాయి. ఎవరైనా అందులో పడితే ప్రమాదం తప్పదు. ఇరవై రోజులు అవుతున్నా గొయ్యిని పూడ్చక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి గోతిని పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.



మండీ బజార్‌కు పోయే వీధిలో ఏర్పడిన గొయ్యి

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

కడప కోటిరెడ్డి సర్కిల్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని వైద్య సిబ్బంది సూచించారు. గురువారం కడప నగరంలోని ఎల్ఎంసీ, ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్ అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్యం పట్ల వారి తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి శిక్షణ వైద్యులతో పాటు హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత, సూపర్ వైజర్ గుల్జర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞతా సమావేశం

వల్లూరు : మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం కావడంతో కడప సమీపంలోని ఆలంఖాన్‌పల్లె సర్కిల్ నుంచి రాజంపేట వెళ్లే బైపాస్ రోడ్డులోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆత్మీయ కృతజ్ఞతా సమావేశం జరుగుతుందని మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వైఎస్ఆర్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

